దేవాలయంలో

ఆరేళ్ళయింది. ఆ వూరికి అయిదుమైళ్ల దూరంలో దేముడు వెలిసి - ఎందుకో ఎవరికీ చెప్పకుండా, అర్ధరాత్రప్పుడు, శివుడు అక్కడ వెలిసి వూరుకున్నాడు! ఆ తరువాత అక్కడ దేవాలయం కట్టించారు. ఏటా శివరాత్రికి, అక్కడ గొప్ప వుత్సవం జరుగుతుంది. ఎక్కడెక్కడనుంచో జనం మూగుతారు. ఆ ఒక్కరోజు ఇసకవేస్తే రాలదు—అంత తీర్థ ప్రజ!

ఈ ఏడు శ్రీదేవికి ఎట్లాగైనా ఉత్సవానికి వెళ్లాలని బుద్ధిపుట్టింది. ఆరేళ్ళయింది. ఇంత దగ్గరగా వున్నా ఒక్కసారి ఉత్సవానికి వెళ్ళలేదు. ఏమిటో, దగ్గరైనకొద్దీ అశ్రద్ధ ఎక్కువవుతుంది. మళ్లీ కాశీ, రామేశ్వరం అన్నీ తిరిగొచ్చింది!

అయినా, ఈమాటు తప్పదు. సాధారణంగా, శ్రీదేవికి ఏవిధమైన ఆలోచన్లు రానేరావు. ఖర్మంచాలక ఎప్పుడైనా ఒక ఆలోచన వచ్చిందీ అంటే, ఇహ అది ఆచరణలో పెట్టేదాకా ఆమెకు నిద్రపట్టదు. పనికట్టుకొని ఇంట్లో అందరినీ ప్రయాణానికి పురికొల్పింది: 'ఏముందీ; పొద్దున్నే బండి కట్టుకొని వెళ్లితే, ఆ మధ్యాహ్నం అక్కడ సత్రంలో దిగి స్వామిదర్శనంచేసుకొని, సాయంకాలానికి ఇంటికి రావచ్చు' ఈ పద్ధతి అందరికి నచ్చింది.

ఈమాట విని పక్కయింటి గవరమ్మగారు కూడా 'నేనూ వస్తాను, పిన్నిగారూ!' అన్నది.

ఆవిడ వస్తే, ఆవిడ కూర్చున్న బండిలో మరొకరికి చోటువుండదు కనుక, ఆవిడకు ప్రత్యేకం వకబండి మాట్లాడాలి. ఇంకా నలుగురు మనుష్యులకు సరిపోయే సామాగ్రి ఎక్కువ మూటకట్టాలి, అంతే:— అయినా తప్పేదేముంది!

శ్రీదేవి కుటుంబానికిచెందినవ్యక్తుల్లో శర్వాణి, రమణి ప్రయాణానికి ఉత్సాహపడ్డారు.

ఒక్క కౌసల్యకు మాత్రం ఈ ప్రయాణం నచ్చలేదు 'ఇప్పు డెందుకు వెళ్ళాలి? అక్కడ గుంపులో చూసేదేమిటి?. ఇక్కడ లేడూ భగవంతుడు?'

సమాధాన మపేక్షించకుండా ఈ ప్రశ్నలు ఒక్కొక్కరినీ వేసింది.

కౌసల్యకు తను ఈమధ్య చదివిన కథ వకటి జ్ఞాపకంవచ్చింది.

ఆ కథలో ఆవిడకు నేలమీద మోకరిల్లి ప్రార్థన చేయడం ఇష్టంవుండదు. కటికనేలమీద కాళ్లు నొప్పులెత్తవూ? శరీరం బాధపడుతూవుంటే మనస్సు భగవంతుని మీద ఎట్లా లగ్నమవుతుందీ? —అందుకని, ఆవిడ మెత్తని పట్టు పరుపుమీద నడుంవాల్చి, చలివెయ్యకుండా కాశ్మీర శాలువా కప్పుకొని, అప్పుడు భగవంతుని స్మరించేది. కాని, పాపం! స్మరణ పూర్తికాకుండానే నిద్రపట్టేది!

కౌసల్యకు ఈ కథ తల్చుకున్నప్పుడల్లా నవ్వొస్తుంది. అయినా, కొంచెం యించుమించుగా కౌసల్యదికూడా ఇదే తత్వం. ఎక్కడికో ఎందుకు వెళ్లాలి! మనకు తలుచుకునే ఓపికవుంటే మన హృదయంలోనే లేడూ భగవంతుడు?

ఆవేళ, అంతా బయలుదేరాలనుకున్నారు. కాని ఏం లాభం? తీరా బళ్ళువచ్చాక, గవరమ్మగారు తను మహా ఎక్కడ పడితే అక్కడ సర్దుకోగల మనిషల్లే 'మీరంతా కూర్చోండి, నేను తరువాత ఎక్కడో ఒకచోటయిరుకుతాను' అని కూచుంది. ఇహ ఆవిడ ముందర సర్దుకుంటేనేగాని తక్కినవాళ్ళు ఎక్కడ సర్దుకోడానికి వీలులేక కొంత ఆలస్య మయింది... గుడిదగ్గరికి చేరేటప్పటికి జనం నేల ఈనినట్లు న్నారు. తీర్థయాత్రచెయ్యాలన్న సరదాతప్ప, వుపవాసానికి తట్టుకోగలవాళ్లెవరూ లేరు. అంచేత, ముందుగా సత్రానికి వెళ్లి, వంటప్రయత్నం చేసుకున్నతర్వాతనే గుడికివెళ్ళారు.

గుడిదగ్గర రకరకాల షాపులు వెలిశాయి. ఆ వక్క రోజు అక్కడ దొరకని వస్తువులేదు. అందరి చేతుల్లోనూ ఏదో వక కొత్తవస్తువు వుండనేవున్నది. శర్వాణికి, రమణికి ముందర గాజులషాపులు చూడాలనిపించింది. శ్రీదేవి కోప్ప డింది. తర్వాత చూడవచ్చంది. కౌసల్య, విధీ విసుగూ లేకుండా, వచ్చినవాళ్ళనందరినీ పరిశీలిస్తోంది.; ముఖ్యంగా స్త్రీలనే. ఎక్కడికి వెళ్లినా కౌసల్యకు అందమైన ఆడవాళ్ళను వెతుక్కోవటంతోనే సరిపోతుంది. చీరల అందం, నగల అందం, చూసి చూసి నెమరువేసుకుంటుంది. ఇంకా అపరి చితవ్యక్తుల హావభావాలనుబట్టి వాళ్ళస్వభావాలువూహించు కోవటంలో తనివితీరని సరదా.

మండపందగ్గర ఎవరో ఒకావిడ త్రోవతప్పినట్లు నిల్చున్నది. పెద్ద హాండ్ బాగ్, రిస్ట్ వాచ్. ఈవిడ ఎందుకు వచ్చిందీ ఇక్కడికి? మాటిమాటికి హాండ్ బాగ్ ఫూపుతుంది.

సరిగపమిట సర్దుకుంటుంది. గుంపులోనుంచి ఇద్దరు వైశ్య బాలికలు తోసుకువచ్చారు. ఈవిడనుచూస్తూ అల్లాగే నిలబడిపోయారు. ఇంగ్లీషుకు ఇంకా విలువ పోలేదన్నమాట!

ఎవరో ఎరుగున్నావిడ శ్రీదేవిని నిలవేసింది: 'ఏమమ్మా మీ ఆయనకు ప్రమోషనయిందట!'

'అట్లాగా! శుభవార్త!! నా కింకా తెలియదులెండి!

రమణి, కౌసల్య నవ్వుకున్నారు.

అందరూ గుళ్లోకి వెళ్ళారు. లోపల అడుగుపెట్టడానికి వీల్లేకుండా వున్నారు జనం. వాకిలిదగ్గరే నిలబడిపొయ్యారు. గవరమ్మగారు మాత్రం తోసుకు ముందుకు వెళ్లింది. ఆ వెనకాలే కొంతదూరం మాత్రం వెళ్ళగలిగింది శ్రీదేవి. రమణి, శర్వాణి ఇంకొకరి కాళ్ళమీద నిలుచుండి స్వామి దర్శనం చేసుకోవాలని చూస్తున్నారు. కౌసల్య మనస్సులో భగవంతుని ధ్యానించాలని చూసింది. కాని ఏమీ లాభం లేదు. ఎప్పుడో, ఎక్కడో, ఏ సముద్రతీరాన్నో ఏ చెట్టు నీడనో, అప్రయత్నంగా హృదయం భక్తితో నిండిపోతుంది. కాని ఇక్కడ,— ఇక్కడ వద్దనుకున్నా నవ్వొస్తుంది!

'కౌసల్యా! దేవుడు కనిపిస్తున్నాడా?' అన్నది శ్రీదేవి.

'ఆహా! ఇం కా రెండునిమిషాల్లో కనిపించేటట్టే వున్నాడు!' అనుకున్నది కౌసల్య-ముందుకీ వెనక్కీ-తోస్తున్న గుంపులో ఉక్కిరిబిక్కిరి అవుతూ.

'అబ్బా! ఊపిరాడడంలేదు. నాలికెండుస్తున్నది! కొంచం తీర్థంఅయినా ఇస్తే బాగుండును!' అన్నది రమణి.

విసుక్కుంటూ అందరూ బయటికివచ్చారు. ఆతర్వాత,

అమ్మవారి గుళ్ళోకి వెళ్ళారు. ఇక్కడ అంత జనం లేరు. సావకాశంగా పూజచేయించవచ్చునుకున్నారు. శ్రీదేవి అష్టోత్తరం చేయిస్తానంది. గవరమ్మ నేనూ చేయిస్తానన్నది. అర్చకుడు 'కుంకుమ తెచ్చారా' అన్నాడు. గవరమ్మ తేలేదు. శ్రీదేవి తన కుంకుమలో సగం ఇస్తుందేమో నను కున్నది. కాని శ్రీదేవి సగం కుంకుమతోపాటు సగం పుణ్యం కూడా పోతుందనుకున్నదేమో, ఏమీ మొగ్గలేదు. కుంకుమ లేదని గవరమ్మకు కళ్ళనీళ్ళపర్యంతం అయింది. కౌసల్యకు ఇద్దరి ప్రవర్తనా నచ్చలేదు.

ఎదురుగా, ఇద్దరు అందమైన అమ్మాయిలుంటే వాళ్ళను చూస్తూ కూర్చుంది. వాళ్ళూ తనని గురించే మాట్లాడుకుంటున్నట్లున్నారు 'ఆజూకాలెంత బాగున్నాయో!'

కౌసల్య తనజూకాలు తడివి చూసుకున్నది.

'ఆ చీర చాల బాగుంది కాదూ! మైసూరు సిల్కు!'

కౌసల్య గర్వంగా తన చీర చూసుకున్నది. అందరూ తనలాగే, చీరలు, నగలు, చూడటానికే వస్తారన్నమాట.

'ఆమెడమీదకాయ పుట్టుకతోనే, వచ్చిందంటావా?'

సంభాషణ మారిందని తెలియక, కౌసల్య అదిరిపడింది. గాభరాగా మెడతడివి చూసుకుంది. కాని ఎదురుగుండా పాపం ఆ లోపంతో ఎవరో బ్రాహ్మణుడు కన్పించాడు.

'అమ్మయ్య! అని గట్టిగా నిట్టూర్చింది.

గవరమ్మ గర్భగుడి వాకిలి కెదురుగా నిల్చున్నది. ఎవరో ముసలమ్మ ప్రాధేయపడుతూ అడిగింది:

'అమ్మా కాస్త పక్కకు తొలగరూ!'

'బాగుంది ! నేనుమాత్రం చూడవద్దూ !'

ముసలమ్మ గొణుక్కున్నది.

'కాదని ఎవరనగలరమ్మా! వాకిలికెదురుగా నిల్చుంటే నైవేద్యంపెట్టేటప్పుడుకూడా వేరే తెరకట్టక్కరలేదు. మా అదృష్టం.'

కౌసల్యకు విసుగొచ్చింది. అక్కడ ఇంక వుండటానికి బుద్ధిపుట్టలేదు. తల తిరుగుతున్నదనిబయటికివచ్చింది.సత్రానికి వెళదామని బయలుదేరింది. వాకిట్లో నరసయ్య కనపడ్డాడు.

'ఏమమ్మా ! ఒక్కరే వచ్చారా ?'

'అబ్బే ! అంతా వచ్చారు, లోపలవున్నారు !'

'దర్శనమైందా ?'

'ఆ ! వాళ్ళింకా పూజచేయిస్తున్నారు. నేను సత్రానికి వెళుతున్నాను.'

'అదేమిటి ? స్వామివారి వాహనాలూ, అమ్మవారి నగలూ అన్నీ చూశారా ?'

నరసయ్య వర్ణించడం మొదలుపెట్టాడు. స్వామికి పన్నెండురకాల వాహనాలున్నాయి. అన్నీ బంగారపువే. అమ్మవారికి ఏడువారాల సొమ్ములూ వున్నవి. ఒక్క రత్నాల హారమే చేస్తుంది లక్షాఏభై వేలు !—తోసపొడుగునా బిచ్చగాళ్ళు బారులుతీర్చి అరుస్తున్నారు.

'ఒక్క కానీ తల్లీ, ఒక్కదమ్మిడీ అమ్మా !'

వినిపించుకోకుండా చెవిటివాళ్ళకు మల్లే దాటి వచ్చారు. నరసయ్య ఇంకా వాగుతూనే వున్నాడు.

'నగలుఅందరికీ చూపించరండీ. మీకు స్పెషల్‌గా—'

'నాకు చూడాలని లేదండి. మా వాళ్ళకు చూపించండి. లోపల వున్నారు' నరసయ్య వెళ్ళిపోయాడు.

భగవంతుడి ఐశ్వర్యం, మానవుడి దారిద్ర్యం రెండూ ఎప్పుడూ ప్రక్క-ప్రక్క-నే వుంటాయి కాబోలు!

ఎదురుగుండా ఎవరో భిక్షుక దంపతులు వస్తున్నారు. అందరు దంపతుల్లాగే వాళ్లకూ ఏదో ప్రణయకలహమో వృత్త కలహమో వచ్చినట్లున్నది. ఆమె ఏడుస్తున్నది.

అతను బాధతో జాలిగా అంటున్నాడు:

'నే నేమన్నాను? ఎందు కేడుస్తావు?' పాపం!..

సందుమలుపు తిరుగుతూ వెనక్కు- తిరిగి చూసింది. వాళ్లిద్దరూ చేతులు పట్టుకొని కలిసివస్తున్నారు. ఆమె ఇప్పుడు ఏడవటంలేదు. వాళ్లిద్దరూ ఒకరికొకరు ఆధారం.

ఒకరిని విడిచి ఇంకొకరు బ్రతుకలేరు.

ఆ స్నేహమే వాళ్లకు జీవితంలో ఆశగలిగిస్తుందేమో! వాళ్లకు ఏమైనా ఇవ్వగలిగితే తన బాధ్యత, బాధ కొంత తగ్గును. కాని చేతులు ఖాళీ.

కౌసల్య ఎంతో నొచ్చుకుంది. ఏదో కలచినట్లయింది. తిరిగి చూడకుండా, గబగబా, సత్రానికి చేరుకుంది. అందరూ గుళ్ళో వుండటంమూలాన సత్రంలో జనసమర్దంలేదు.

సత్రానికివెనుక వేపునచిన్నతోటవుంది. అక్కడికెళ్ళింది

తోటమధ్యలో చిన్న కొలను వుంది. ఆ కొలను ఒడ్డునే పొన్నచెట్టు నీళ్ళవైపుకు వంగివుంటుంది. రాలిన పొన్నపూవులన్నీ నీళ్ళలో వరసగా పేర్చినట్లుంటాయి.

అరటిచెట్లూ, కొబ్బరిచెట్లూ, మధ్య మధ్యన ఏవో పూల మొక్కలూ, అన్నీ గుబురుగుబురుగా వుంటాయి.

పచ్చని గడ్డిలో ఎఱ్ఱని తీగ విచ్చలవిడిగా ప్రాకివుంది.

అట్టే అంత శ్రద్ధతీసుకొని పెంచిన తోటకాదు. ఒక వేళ అందునించే అంత ఆకర్షనంతంగా వుంటుందేమో!

కొలను దక్షిణపువేపున చిన్న చలువరాతి మందిరం వున్నది. అందులో కృష్ణవిగ్రహం తీర్చి దిద్దినట్లుంటుంది. ఆ మందిరంలో నిత్యం పూజా పునస్కారాలు లేవు. చుట్టూ చెట్లన్నీ ఆ గుడిమీదికి సగం వాలి వుంటాయి. ఆ మందిరం అక్కడ కేవలమూ అందంకోసరమే కట్టబడినట్లుంటుంది.

కౌసల్య కొలను మెట్లమీద నీళ్ళల్లో కాళ్లు పెట్టుకు కూర్చుంది. ఎక్కడా, ఆకైనా కదలని నిశ్శబ్దం. ఆక్షణంలో ఆమెకు నిశ్శబ్దమే స్నేహితురాలైంది.

కాలితో నీరు కదిపింది. వళ్ళంతా నీళ్ళు చిందాయి.

అమ్మయ్య! ఇక్కడ ఎంత హాయిగా వున్నది!! అప్రయత్నంగా ఆమె కళ్ళు మూతలుపడ్డాయి. 'భగవాన్! భగవన్!'- అల్లా ఎంతసేపు వున్నదో ఆమెకే తెలియదు.

'ఇక్కడున్నావా తల్లీ! నీకోసం గుడిఅంతా వెదకలేక చచ్చాం!' అన్నది రమణి.

'త్వరగా లే! శ్రీదేవి ఇప్పుడే వెళ్ళిపోదామంటున్నది' అన్నది శర్వాణి.